నిరాశ నింపిన నిష్పత్తి

చర్చ

ఇప్పుడు రాష్ట్ర నిరుద్యోగుల చూపంతా 'ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీయస్సీ)' పైనే వుంది. అది తీసుకున్న, తీసుకోనున్న నిర్ణయాలు తమ తల రాతల్ని ఏ విధంగా మారుస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు వయస్సు ముందుకొస్తూ, మరో వైపు ప్రభుత్వం ఇచ్చిన వయస్సు సడలింపు పూర్తయిపోతూ వుంది. దీంతో అభ్యర్థుల్లో నిరాశ చోటుచేసుకుంటోంది. దానికి కారణాలు చాలానే వున్నాయి. ఇటీవల ఏపీపీయస్సీ పంచాయతీ సెక్రటరీ, గ్రూప్-2 పరీక్షల ఫైనల్ 'కీ' లను విడుదల చేసి, పరీక్షా తేదీలను ప్రకటించింది. అయితే ఏకపక్ష ధోరణిలో తీసుకున్న ఈ నిర్ణయం అభ్యర్థుల్లో అసంతృప్తి రగిల్చింది.



సోమేపల్లి వెంకట సుబ్బయ్య

సమస్య ఏంటి?

ఏపీపీయస్సీ సంస్కరణల్లో భాగంగా సిలబస్ లో భారీ మార్పులు చేసింది. సిలబస్ భారీగా పెంచింది. నెగెటివ్ మార్కుల విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రధాన పరీక్షని ఆన్ లైన్ లో నిర్వహించింది. ఇంకా ప్రాథమిక పరీక్ష నుండి ప్రధాన పరీక్షకు తీసుకునే అభ్యర్థుల నిష్పత్తిని 1:50 నుండి 1:12 కి తగ్గింపు వంటి వాటిని అన్నింటినీ ఒకేసారి ప్రవేశ పెట్టింది. ఇవి అసంతృప్తికి ఒక కారణం అయితే ప్రశ్నాపత్రాలు తప్పుల తడకగా, నిర్లక్ష్యంగా రూపొందించడం మరో కారణం. దీంతో వేలాది మంది అభ్యర్థులు నష్టపోయే పరిస్థితులు దాపురించాయి. నిజానికి మార్పులు మంచివే. అయితే అన్నీ ఒకేసారి ప్రవేశ పెట్టటం గ్రామీణ ప్రాంత అభ్యర్థులకైతే తీరని నష్టం కలిగిస్తోంది. 'యూపీయస్సీ' తరహాలో అన్ని మార్పులు తెస్తామంటున్న ఏపీపీయస్సీ, యూపీయస్సీ లాగా తగిన సమయం ఇస్తూ మార్పులు ప్రవేశ పెట్టలేదు. యూపీయస్సీ లాగా క్యాలండర్ పద్ధతిలోనూ, ప్రమాణాల్లోనూ పరీక్ష నిర్వహణ చేయలేదు. మొన్న జరిగిన గ్రూప్-2 పరీక్ష పత్రం చూస్తే తప్పుల తడకగా వుంది. ఇంగ్లీష్ నుండి తెలుగులో ప్రశ్నలు అనువాదం చేశారు. అయితే వాటిని అటు ఇంగ్లీష్ మీడియం వాళ్ళు గాని, ఇటు తెలుగు మీడియం వాళ్ళు గాని అర్థం చేసుకోలేని విధంగా తయారు చేశారు. మొన్న విడుదల చేసిన ఫైనల్ 'కీ' లో 9 ప్రశ్నలను తొలగించారు. వాటిల్లో అనువాద దోషాలున్న ప్రశ్నలూ వున్నాయి. తెలుగు మీడియం అభ్యర్థులు నష్టపోకుండా ఉండటానికి ఏపీపీయస్సీ తీసుకున్న నిర్ణయమిది. ప్రశ్నాపత్రంలో తెలుగు, ఇంగ్లీషు ప్రశ్నల విషయంలో ఏదేని తప్పులుంటే ఇంగ్లీషునే ప్రామాణికంగా తీసుకోవాలన్నది ఏపీపీయస్సీ విధానం. ఇది ప్రశ్నాపత్రం లోనే స్పష్టంగా రాసి ఉంటుంది. ఇప్పుడు భాషా దోషాల మూలంగా తొలగించిన ప్రశ్నల వలన ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులకు చాలా నష్టం వాటిల్లుతోంది. గ్రూప్-1 పరీక్షలో అయితే 30 ప్రశ్నల వరకు అనువాద దోషాలున్నాయి. ఏపీపీయస్సీ వాటన్నిటినీ తొలగిస్తే ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుంది. అంటే ఏపీపీయస్సీ చేసిన తప్పులకు అభ్యర్థులు తమ కాలాన్నీ, ప్రతిభనూ పణంగా పెట్టాలన్నమాట. ఇది ఏపీపీయస్సీకి, అభ్యర్థులకు మధ్యన సమాధానం దొరకని సమస్య అవుతోంది.

జీవో నెం-5 నిజంగా సమస్యేనా? ఏపీపీయస్సీ ప్రాథమిక పరీక్ష నుంచి ప్రధాన పరీక్షకు జీవో నెంబర్-5 అనుసరించి 1:12 నుండి 1:15 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేస్తామని అంటోంది. దాని కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్ద కూడా ఒక సమావేశం జరిపింది. ప్రస్తుతానికి ఈ నోటిఫికేషన్ కోసం ఈ నిష్పత్తినే అనుసరించడానికి ప్రభుత్వం ఒప్పుకున్నట్టుగా ఏపీపీయస్సీ ప్రకటించి, 1:12 నిష్పత్తిలో గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలు ప్రకటించింది. గతంలో జరిగిన పరీక్షల్లో ఈ నిష్పత్తి 1:50 గా వుండేది. భవిష్యత్తులో రానున్న నోటిఫికేషన్లలో కూడా ఈ నిష్పత్తి ప్రభుత్వ అనుమతితో 1:50 గా వుంచుతామని పేర్కొంటోంది. అసలిక్కడ ఒక విషయం పరిశీలించాలి. జీవో నెం.5 లో ప్రభుత్వం ఎక్కడా ఎంత నిష్పత్తిలో తీసుకోవాల్సింది పేర్కొనలేదు. ఆ విచక్షణ ఏపీపీయస్సీకే వదిలేసింది. అటువంటప్పుడు గత నోటిఫికేషన్ కి భిన్నంగా 1:12 తీసుకుని ప్రభుత్వంపై నెపం వేయటం సరైన విధానం కాదు. రాబోయే పరీక్షల్లో 1:50 నిష్పత్తిలో తీసుకోదలచినప్పుడు, గతంలోనూ ఇదే విధానం అవలంబించినప్పుడు ప్రస్తుత నోటిఫికేషన్లో మాత్రం 1:12 ఎందుకు తీసుకోవాలి? ఇది నిరుద్యోగులకు అన్యాయం చేయటం కాదా? ప్రభుత్వం నిరుద్యోగులకు మేలు చేస్తామని వయో పరిమితిని రెండు సంవత్సరాలు పెంచి ప్రయోజనం ఏంటి? అది కాస్తా 1:12 నిష్పత్తితో నిష్ఫలమవుతున్నది. మరో నోటిఫికేషన్ వచ్చే లోపల అనేక మంది అభ్యర్థులు వయసు మీరిపోతారు. అదే ఎక్కువ మంది ప్రధాన పరీక్ష రాయటానికి అవకాశం వుంటే వయస్సు మీరిపోయే అభ్యర్థులకి కొంతైనా ప్రయోజనం చేకూరుతుంది.



ఇన్ని సంవత్సరాలకు వచ్చిన నోటిఫికేషన్ ప్రధాన పరీక్ష రాయకుండానే ముగిసి పోతోంది. గత ప్రభుత్వం పొడిగించిన వయస్సు మరో నోటిఫికేషన్ కు పనికిరాదు. అందుకే వాళ్ళు కోరేది ఒక్కటే. గత పరీక్షా విధానం లాగా ప్రాథమిక పరీక్ష నుండి ప్రధాన పరీక్షకు 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను తీసుకోమంటున్నారు.

అభ్యర్థులు కోరేదేంటి?

ఇన్ని సంవత్సరాలకు వచ్చిన నోటిఫికేషన్ ప్రధాన పరీక్ష రాయకుండానే ముగిసి పోతోంది. గత ప్రభుత్వం పొడిగించిన వయస్సు మరో నోటిఫికేషన్ కు పనికిరాదు. అందుకే వాళ్ళు కోరేది ఒక్కటే. గత పరీక్షా విధానం లాగా ప్రాథమిక పరీక్ష నుండి ప్రధాన పరీక్షకు 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను తీసుకోమంటున్నారు. అప్పుడు అటు తెలుగు, ఇటు ఇంగ్లీష్ మాధ్యమ అభ్యర్థులకు న్యాయం జరుగుతుంది. మార్పులకు కూడా కాస్త సడలింపు ఇచ్చి ఊరటనిచ్చినట్టుంది. అయితే ప్రభుత్వమే ఈ జీవోను రద్దు చేస్తూ మరో జీవో విడుదల చేస్తే గానీ నిష్పత్తి మార్చబోమని ఏపీపీయస్సీ అంటోంది. ఇది సరైంది కాదు. కావాలంటే వచ్చే నోటిఫికేషన్ లో 1:50 లో తీసుకుంటా మనటం హాస్యాస్పదం. ఈ నోటిఫికేషన్ లో తప్పు జరిగితే వచ్చే నోటిఫికేషన్ లో మార్పులు చేయటం ఏంటో వారికే తెలియాలి. ఈ విషయంలో ఏపీపీయస్సీ ప్రభుత్వాన్ని తప్పు దారి పట్టిస్తున్నట్టు కనిపిస్తోంది. అసలు జీవో నెం.5 లో పరీక్షలో అభ్యర్థులను తీసుకోవటం గురించి ప్రభుత్వం పూర్తిగా ఏపీపీయస్సీ కి అధికారాలిచ్చింది. ఏపీపీయస్సీ నోటిఫికేషన్ లోనూ ఎక్కడా 1:12 నిష్పత్తి అని ప్రస్తావించలేదు. కేవలం మౌఖికంగానే ప్రకటన చేసింది. కాబట్టి ఏకపక్ష ధోరణి వదిలి 1:50 నిష్పత్తిలో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 ప్రధాన పరీక్షలకు అభ్యర్థులని తీసుకుని అందరికీ అవకాశం ఇవ్వాలి. ప్రభత్వం దీనిపై చొరవ తీసుకుని నిరుద్యోగుల నిరాశలను తొలగించాలి. వెంటనే సరైన నిర్ణయం తీసుకోవాలి. ఎక్కువ మంది అభ్యర్థులకు ప్రధాన పరీక్ష రాసే అవకాశం కల్పించాలి.

(వ్యాసకర్త విశ్రాంత డిప్యూటీ కలెక్టర్,
సెల్ : 9000004565)